క్లుప్తంగా

జీవనశైలి వ్యాధులపై అవగాహన ఉండాలి



నిజామాబాద్‌నాగారం: ప్రజలు జీవనశైలి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న జీవనశైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, చికిత్స రిఫరల్ సర్వీసెస్ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలో ఆశాలు, ఏఎన్‌ఎంలు ఆబా కార్డు జనరేషన్, ఏఎన్‌ఎం పరీక్షలు చేసి, పీహెచ్‌సీ వైద్యాధికారికి రిఫర్ చేయాలన్నారు. డబుల్, డమ్మీ ఎంట్రీలు చేయొద్దని అన్నారు. కార్యక్రమంలో ఎన్సీడీ డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ అబ్దుల్ వాసి, పీవోఎన్సీడీ సామ్రాట్ యాదవ్, కో–ఆర్డినేటర్ పి వెంకటేశం, డీహెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో కేజీబీవీల్లో ఖాళీ పోస్టులకు సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు గురువారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. పీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన చేశారు.

21న శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని బోర్గాం(పి)లో ఉన్న శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఈ నెల 21న సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ పునశ్చరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు టి అరుణ్‌కుమార్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు పారాయణంలో పాల్గొనాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఉపాధ్యాయులు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను పారదర్శకంగా నిర్వహించి, పిల్లల సంఖ్య ఎక్కువ ఉన్న దగ్గర ఉపాధ్యాయులను కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు కలెక్టర్‌ను గురువారం కలిసి కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు రామచందర్ గైక్వాడ్, గౌరవాధ్యక్షులు మోతె సాయన్న, శివానంద్, సుశీల్ కుమార్, ఎ భూషణ్ ఉన్నారు.

కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

- సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల మార్పులు
- రెవెన్యూ, అకౌంట్స్, మెప్మా, ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో సైతం..
- శుక్రవారం నుంచి మారిన సెక్షన్లలో రిపోర్టు చేయాలని ఆదేశం



నిజామాబాద్ సిటీ: బల్దియా పాలనను వేగవంతం చేసేందుకు మున్సిపల్ కమిషనర్ పావులు కదుపుతున్నారు. కార్పొరేషన్‌లోని పలు విభాగాల్లో కొన్నేళ్లుగా ఎలాంటి మార్పులు లేకుండా పాతుకు పోయిన వారి స్థానాలను మారుస్తున్నారు. మొన్న ఇంజనీరింగ్ అధికారుల అంతర్గత బదిలీలు చేసిన కమిషనర్ తాజాగా సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, మెప్మా విభాగాల్లో అంతర్గత బదిలీలు చేశారు. ఇక అతిపెద్ద శాఖ శానిటేషన్ ఒక్కటే మిగిలి ఉంది. త్వరలో అందులో, మెప్మా విభాగంలో కూడా మార్పులు చేర్పులు చేయనున్నట్లు కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి అంతర్గత సర్క్యులర్ జారీచేశారు. బదిలీ అయినవారు వెంటనే కొత్త విభాగాల్లోకి వెళ్లాలని ఆదేశించారు.

బదిలీలు ఇలా..

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న అబ్దుల్ ఖయ్యూమ్ ముస్తకీంను రెవెన్యూ ఆఫీసర్‌గా నియమించారు. ఉద్యోగుల వేతనాలు చేసే సీనియర్ అసిస్టెంట్ టి శ్యామయ్యను డీజిల్ బిల్లులు, ఏబీసీ సెంటర్, పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణ బిల్లులు చేసే పని అప్పగించారు. విజయ్‌సింగ్‌ను ఎఫ్–2, 3 నుంచి ఎఫ్–1కు మార్చారు. సీనియర్ అసిస్టెంట్ కె స్వప్నను అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు చేసే విభాగానికి మార్చారు. జి రాజేశ్వరిని మెప్మా నుంచి రెవెన్యూ సెక్షన్‌కు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ బి బాల్‌రెడ్డిని ఆర్‌ఐ నుంచి బర్త్ అండ్ డెత్ సెక్షన్‌కు మార్చారు. సీనియర్ అసిస్టెంట్ బి గంగమల్లును పెన్షన్ విభాగానికి మార్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా బి దిలీప్ (జోన్–5), బి మోహన్ (జోన్–3), ఎస్ దిలీప్(జోన్–1)లకు బదిలీ చేశారు. సయ్యద్ నొహిత్‌ను ఆర్‌ఐ నుంచి రెవెన్యూ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్‌గా మార్చారు. జూనియర్ అసిస్టెంట్ కె సాయికుమార్‌ను ఎఫ్–1 నుంచి ఆర్టీఐ, కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు పరిశీలించే పనులు అప్పగించారు. కె ప్రమీలను 11వ డివిజన్ వార్డు ఆఫీసరుగా నియమించారు. మెప్మా సీవో పి అశోక్‌ను ఎఫ్–1 సెక్షన్‌కు మార్చారు. ఎం గంగాభవానీని ఎఫ్–1 నుంచి ఎఫ్–2కు మార్చారు.

విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలి

సుభాష్‌నగర్: విద్యుత్ సంస్థలో 1999 నుంచి 2004 వరకు నియామకమైన ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు జేఏసీ ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జేఏసీ వినతిపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్పందించారు. విద్యుత్ సంస్థలు, ఉద్యోగులు, ఇంజనీర్లు ప్రణాళిక ప్రకారం పని చేయడం వల్లే గతేడాది పంటలు బాగా పండాయని అభినందించారు. వినతిపత్రంలో పొందుపర్చిన సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, అసెంబ్లీలో ప్రస్తావిస్తానని వారికి హామీనిచ్చారు. ఇందుకు జేఏసీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కో కన్వీనర్ తోట రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం, డిప్యూటీ సీఎంపై తమకు పూర్తి విశ్వాసముందన్నారు. ఉద్యోగి ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే రూ.కోటీ ఇన్సూరెన్స్ కల్పించాలని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ కూడా రాష్ట్రవ్యాప్తంగా 5వేల మంది ఉద్యోగులకు వర్తింపజేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, నాయకులు శ్రీనివాస్, శ్రీరామ్మూర్తి, రాజేందర్, చంద్రశేఖర్, శంకర్ నాయక్, సతీశ్, హరికృష్ణ, శ్రీనివాస్, రాంగోపాల్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



జక్రాన్‌పల్లి: మండలంలోని జక్రాన్‌పల్లి, మునిపల్లి, మనోహరాబాద్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, నాయకులు దీకొండ శ్రీనివాస్, తలారి సతీశ్, రబ్బ వెంకట్, మాదరి దేవరాజ్, అఖిలేశ్, మహిపాల్‌రెడ్డి, సాయన్న, రాజేశ్వర్, రంజిత్, గంగాధర్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలి



నిజామాబాద్ సిటీ: ఆలయ చైర్మన్లుగా ఎన్నికైన వారు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన రెండు ఆలయాల చైర్మన్లుగా నియమించబడ్డ కాంగ్రెస్ నాయకులు గడుగు గంగాధర్‌ను కలిశారు. గురువారం గడుగు నివాసంలో కలిసి న శంభుని గుడి చైర్మన్ మధు, జెండా బాలాజీ ఆలయ చైర్మన్ లవంగ ప్రమోద్‌లను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు గడుగును సన్మానించారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం



గన్నారంలో నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు



గడ్డ కట్టిన వెయ్యి సంచుల సిమెంట్ బస్తాలు

ఇందల్వాయి: నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఉంది గన్నారం గ్రామంలో నిర్మించ తలపెట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిస్థితి. పిల్లర్ స్థాయిలోనే పనులు ఆగిపోగా నిర్మాణం కోసం తెచ్చిన స్టీల్ తుప్పు పట్టి, సుమారు వెయ్యి సంచుల సిమెంట్ అక్కడే గడ్డకట్టి పాడయిపోయింది. 2022 సంవత్సరంలో రూ. 5 కోట్లకు పైగా నిధులతో మొదలైన వంద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ఆగిపోవడంతో గ్రామంలోని ఇల్లు లేని పేదలు నిరాశ చెందుతున్నారు.

శాకంబరిగా లలితాదేవి



నిజామాబాద్ రూరల్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న లలితా దేవి ఆశ్రమ ఆలయంలో గురువారం లలితా దేవిని శాకాంబరి మాతగా అలంకరించారు. అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించినట్లు ఆలయ ధర్మాధికారి రాజేంద్రశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు గాలి నాగరాజు, కార్యవర్గ సభ్యులు కొమ్మ సుధాకర్, మోటూరి వెంకటేశం, శేఖర్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంబౌలి ఏరియాలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. పంబౌలి ఏరియాలో షేక్ అఫ్రోజ్, షేక్ అయాజ్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి 238 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



సిరికొండ: సిరికొండ జీపీ పరిధిలోని మహిపాల్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. సొసైటీ డైరెక్టర్, ఏబీఎస్‌ఎస్ మండల అధ్యక్షుడు రూప్‌సింగ్, జీపీ కార్యదర్శి వినీల్, ఫీల్డ్ అసిస్టెంట్ గణేశ్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం



సిరికొండ: మండలంలోని కొండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లాల్‌సింగ్, పీఆర్టీయూ నాయకులు మోజీరాం, నరహరి, ఉపాధ్యాయులు మోతీలాల్, ధర్మవీర్, అన్వర్, మురళి, శ్రీనివాస్, సాయికుమార్, స్వప్న, యశోద పాల్గొన్నారు.

చేపల మార్కెట్ పనులు ప్రారంభమయ్యేలా చూడాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్: నగరంలోని అర్సపల్లి శివారులో ఉన్న మత్స్యశాఖ స్థలంలో నిర్మించనున్న చేపల మార్కెట్ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు గురువారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో మత్స్యశాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, చేపల పెంపకం, చెరువులు, గంగపుత్రుల సభ్యత్వం, సంఘాలు, తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఫిషరీష్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్, డీఎఫ్‌సీఎస్ చీఫ్ ప్రమోటర్ కస్ప శ్రీనివాస్, నగర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పల్లికొండ అన్నయ్య, బాడ్సి రమేశ్ ఉన్నారు.

మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలి



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ సీపీఎం నాయకులు రమేశ్ బాబు, సుజాత కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయడానికి సరిపడా థియేటర్లు లేకపోవడంతో రోగులు రోజుల తరబడి దవాఖానాలోనే వేచి ఉంటున్నారని, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తే మహిళల ప్రసవాలను నిర్వహించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు.

ఓటరు జాబితాను అప్‌డేట్ చేయాలి



సిరికొండ: ఓటరు జాబితాలో తప్పు ఒప్పులను సరి చేసి అప్‌డేట్ చేయాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌వోలకు శిక్షణను గురువారం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. ఫారం 6, 7, 6ఏ, 8 లను ఏ విధంగా నింపాలి, ఓటరులను ఎలా నమోదు చేయాలని వివరించారు. తహసీల్దార్ రవీందర్‌రావు, డీటీ ప్రవీణ్, ఆర్‌ఐలు గంగరాజం, నాగన్న, ట్రైనర్లు రవికుమార్, ప్రవీణ్‌కుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

- సాయిబాబా, దత్తాత్రేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- సామూహిక సత్యనారాయణ వ్రతాలు



మాధవనగర్ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దత్తమందిరంలో హారతి ఇస్తున్న స్వామిజీ



గురువులను సన్మానించిన దయానంద్ యోగా ట్రస్ట్ సభ్యులు



గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్



సిరికొండలో హెచ్‌ఎంను సన్మానిస్తున్న నాయకులు



శ్రీరామానందరాయ్ ప్రభుదాస్‌ను సన్మానిస్తున్న నాయకులు



ధర్పల్లిలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



జక్రాన్‌పల్లి: వివేకనగర్ తండాలో..



సిర్‌పూర్‌లో గురువులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



మహాగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రాంగోపాల్ కాలనీలో భజనలు చేస్తున్న కాలనీవాసులు

సాక్షి నెట్‌వర్క్: గురు పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని సాయిబాబా, దత్తాత్రేయుని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట్ల సత్యనారాయణ స్వామి వ్రతాలు, అన్నదానాలు, యజ్ఞ పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ సేవ చేపట్టారు. పాఠశాలల్లో, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. గురుపౌర్ణమి గురించి ప్రముఖులు విద్యార్థులకు వివరించారు. దయానంద్ యోగాట్రస్ట్ సుభాష్‌నగర్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే వ్యక్తి గురువు అని, ప్రతి వ్యక్తికి మొదటి గురువులు తల్లిదండ్రులేనని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం గురుపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం లోగల శ్రీ లింగేశ్వర ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమాధిపతి పిట్ల కృష్ణ మహారాజ్ ఆశీర్వాదాలు పొందారు. అనంతరం నగరంలోని దత్త గుడి, నీరుగొండ హనుమాన్, పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, వేద పండితులను ఘనంగా సన్మానించారు.

డంపింగ్‌యార్డు పరిశీలన



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

నిజామాబాద్ సిటీ: నాగారం డంపింగ్‌యార్డును మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ గురువారం ఇంజినీరింగ్ అధికారులతోకలిసి పర్యవేక్షించారు. సీడీఎంఏ అధికారులు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లైవ్‌లో డంపింగ్‌యార్డును పరిశీలించారు. తడి, పొడిచెత్తను వేర్వేరుగా డంపింగ్ చేయాలని సూచించారు. బయో మైనింగ్ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సూచించారు. డంపింగ్ యార్డు ఇన్‌చార్జి ప్రభుదాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవి బాబు, ఈఈ మురళీమోహన్‌రెడ్డి, డీఈ ముస్తాక్ అహ్మద్, ఏఈ ఇనాయత్ కరీం, ఎంఏ రషీద్, ఏఎంసీ జయకుమార్, ఇన్‌చార్జి ప్రభుదాస్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నిజామాబాద్ సిటీ: నగరంలోని పలు జోన్లలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ దిలీప్ కుమార్ ఇన్‌చార్జి ఎంహెచ్‌వోతో కలిసి గురువారం పరిశీలించారు. బోర్గాం(పి), నాందేవ్‌వాడ, ఖలీల్‌వాడీ, అర్సపల్లిల్లో జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పనులు జాప్యం లేకుండా పూర్తిచేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు తదితరులు ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,400	వెండి(కిలో)	1,12,000
22 క్యారెట్స్	89,910		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	50	80	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	50	80	దోసకాయ	15	30
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	50	80
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	45	75
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల/కళాశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మహిళా సంఘ సభ్యులకు, పూర్వ అనుభవం కలిగిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 14న పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

సమ్మె విజయవంతంపై హర్షం

నిజామాబాద్ సిటీ: దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసిన కార్మిక వర్గానికి టీయూసీఐ నాయకులు అభినందనలు తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని కోటగల్లిలో సమావేశం నిర్వహించి సమ్మె విజయంపై హర్షం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెను జిల్లా ప్రజలు విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నరేందర్, సుధాకర్, సాయారెడ్డి, కిరణ్, రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

సిరికొండ: సిరికొండ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జె రామకృష్ణను బీజేపీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లా నాయకులు రాజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బాబురావు, మహేందర్, రంజిత్‌రెడ్డి, మారుతి, అజయ్, శంకర్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో నలుగురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారికి గురువారం ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం నగరంలోని కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి వారిలో ఏడుగురికి రూ. 11500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నలుగురిలో ఒకరికి ఒకరోజు, ఇద్దరికి రెండు రోజులు, ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి..

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి మద్యం అతిగా తాగి న్యూసెన్స్ చేసిన ఒకరికి జిల్లా కోర్టు ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి మద్యం అతిగా తాగి నగరంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించాడు. వెంటనే అతడిని పోలీసులు అరెస్టు చేసి, గురువారం స్పెషల్ సెకండ్ క్లాస్ జడ్జి నూర్జహాన్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి అతడికి ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం అతడిని జిల్లా జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

దాబాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే దాబాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. మోర్తాడ్, వేల్పూర్ ప్రాంతాల్లోని పలు దాబాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా సిట్టింగ్‌లు నిర్వహిస్తున్న యజమానులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, ఎస్సై గోవింద్ తెలిపారు.